www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 31 | జనవరి | 2025 పేజీలు 8

## గంజాయి అక్రమ రవాణా

**- పట్టుబడ్డ జర్నలిస్టులు**
**- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు**




**ప్రజాపక్షం/భద్రాచలం :** గంజాయి అక్రమ రవాణా చేస్తూ ఇద్దరు జర్నలిస్టులతో పాటు ముగ్గురు అడ్డంగా దొరికిపోయారు. వివరాల ప్రకారం భద్రాచలం పట్టణంలోని గోదావరి వంతెన సమీపంలో నార్కోటిక్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా అటుగా వచ్చిన ప్రెస్ స్టిక్కర్ ఉన్న కారును ఆపి సోదాలు చేయగా 81 కిలోల గంజాయి కారులో కనిపించింది. దీని విలువు సుమారు రూ.20.23 లక్షల వరకు ఉం టుంది. ఈ కారులో బూర్గంపాడుకు చెందిన ఇద్దరు విలేకరులు ఉన్నారు. వీరిలో ఒకరు ప్రెస్క్లబ్లో కీలకపదివిలో కొనసాగుతున్నారు. వీరితో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని కుంట ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని కూడా అదుపులోనికి తీసుకున్నారు. వీరిని అదుపులోనికి తీసుకున్న నార్కోటిక్ పోలీసులు పట్టణ పోలీస్‌లకు కారుతో పాటు అప్పగించారు. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది. జర్నలిస్టుగా చెలామణి అవుతూ ప్రెస్క్లబ్ స్టిక్కర్ ఉన్న కారులో అక్రమంగా పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తూ పట్టుబడటంతో అంతా నివ్వెరపోతున్నారు.

## ఖమ్మం మార్కెట్‌కు
# పోటెత్తిన మిర్చి





**-మిర్చి రైతుపై ధరాఘాతం**
**-జెండా పాట రూ. 14వేలు.. కొన్నది రూ.13వేల లోపే..**
**-మిర్చి రైతుకు తప్పని కష్టాలు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మార్కెట్‌కు ఎర్ర బంగారం పోటెత్తింది. గురువారం ఖమ్మం మార్కెట్‌కు 60వేల బస్తాలకు పైగా మిర్చి విక్రయానికి రైతులు తీసుకు వచ్చారు. ఈ ఏడాది ధర తగ్గిందని రైతాంగం ఆందోళన చెందుతున్న వేళ వ్యాపారులు మరోసారి తమ నైజాన్ని బయట పెట్టుకున్నారు. రెండు రోజుల క్రితంతో పోల్చినప్పుడు రూ.1,000 క్వింటాకు ధర తగ్గించారు. జెండా పాట 14వేలు కాగా క్వింటా రూ.10వేల నుంచి రూ.13వేల లోపు మాత్రమే కొనుగోలు చేశారు. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది అననుకూల పరిస్థితులు, తెగుళ్ల నడుమ మిర్చి ధర గణనీయంగా తగ్గింది.

మిగతా 2లో..

## తాగునీటి కోసం ఆందోళన..!

**-పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రెండేళ్లగా తాగునీటి కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆందోళన నిర్వహించారు. నేలకొండపల్లి మండలం లోని తిరుమలాపురం తండా పంచాయతీలో ఓ ప్రాంతం కు చెందిన ప్రజలకు తాగునీటి సరఫరా చేయటం లేదని, గురువారం మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి సురేష్ కార్యాలయం వద్దకు చేరుకోగా మహిళలు చుట్టుముట్టి నిలదీశారు. ఆరుపులు, కేకలతో ఆందోళన చేపట్టారు. నీళ్ల కోసం ఊరంతా వెతికి తీసుకోవాల్సి వస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కొంతమంది పంచాయతీ వాటర్ ను మోటార్లు ద్వారా ట్యాంక్లకు ఎక్కిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మరి కొంత మంది పెద్ద పైపులు వేసుకోవటం వలన తమ ప్రాంతం కురావటం లేదని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన పెద్ద పైపులను మరియు మోటార్ల ద్వారా నీటిని తీసుకుంటున్న వారి మోటార్లు తీసేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆందోళనకారులతో మాట్లాడారు. గేట్ వాల్ వేస్తున్నప్పటికీ పగిలిపోతుందని తెలిపారు. రెండు రోజులలో తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అదే విధంగా మోటార్లు, పెద్ద పైపులను తొలిగిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళనవిరమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు కమదన ప్రవీణ్, బాధితులు తేజావత్ అరుణ, లినీమా, దేవ్లా, ఉపేందర్, సాయి, బద్రు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల
# అభివృద్ధికి చర్యలు




**-ఖమ్మం టూరిజంకు బ్రాండింగ్ కల్పించాలి**
**-పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సంబంధిత అధికారులతో

మిగతా 2లో..

## కమ్యూనిస్టు కార్యాలయాలు..
# ఉద్యమ కేంద్రాలు



**-అవకాశవాద రాజకీయాలు పెను ప్రమాదం**
**-ముస్తఫానగర్‌లో సిపిఐ కార్యాలయం ప్రారంభం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూనిస్టు కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడతాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలే పేద, మధ్య తరగతి ప్రజలకు రక్షా అని కమ్యూనిస్టు పార్టీలు మరింత పురోగమించేలా కృషి చేయాలన్నారు. గురువారం ముస్తఫానగర్‌లోని అల్లిపురం క్రాస్ రోడ్డు వద్ద సిపిఐ కార్యాలయాన్ని హేమంతరావు ప్రారంభించారు. కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని కార్పొరేటర్ బిజి క్లైమెంట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాడుగుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో హేమంత రావు మాట్లాడుతూ నిరంతరం

మిగతా 2లో..

# ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



(మొదటిపేజీ తరువాయి)

మొదటి కోత మిర్చి మార్కెట్‌కు వచ్చినప్పుడు ఈ పరిస్థితి ఉంటే ఇక రెండవ కోత వస్తే మిర్చి ధర మరింతగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మంజిల్లాలో 70వేల ఎకరాల మిర్చి సాగు చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గతేడాదితో పోల్చినప్పుడు మిర్చి సాగు పెరగడంతో పాటు పెట్టుబడి కూడా పెరిగింది. తెగుళ్లు రావడం ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ప్రారంభంలో అతివృష్టి తదితర కారణాలతో మిర్చి పెట్టుబడి పెరిగింది. గతేడాది ఇదే సమయంలో మిర్చి రూ. 18వేల వరకు ధర పలకగా ఈ ఏడాది జెండాపాట మినహా రూ. 13 వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. వాణిజ్య పంటలకు సంబంధించి పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అతివృష్టి కారణంగా ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. పత్తి దెబ్బతిన్న తర్వాత మెట్ట రైతులు మిర్చి మీద ఆశలు పెంచుకున్నారు. దిగుబడి తగ్గడం, ధర కూడా తగ్గడంతో ఈ ఏడాది మిర్చి రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడింది. ధర తగ్గింపు స్థానిక వ్యాపారులు సిండికేట్ కావడం వల్లే జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఆర్టిసిలోనే తక్కువ ప్రమాదాలు

-ప్రమాద రహిత డ్రైవర్లకు సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదాల్లో అతి తక్కువ శాతం ఆర్టిసిలో మాత్రమే ఉన్నాయని జిల్లా రవాణా శాఖాధికారి వెంకటరమణ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రీజినల్ ముగింపు కార్యక్రమం గురువారం ఖమ్మం నూతన బస్టాండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖాధికారి వెంకటరమణ, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజియన్ స్థాయిలో ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించారు. ప్రథమ స్థానంలో ఖమ్మం డిపోకు చెందిన బి. రాములు (ప్రమాద రహిత సర్వీస్ 28 సంవత్సరాల నాలుగు నెలలు), ద్వితీయ స్థానం ఖమ్మం డిపోకు చెందిన డి. అంథోని (ప్రమాద రహిత సర్వీస్ 28 సంవత్సరాల నాలుగు నెలలు), తృతీయ స్థానం మణుగూరు డిపోకు చెందిన వి. వెంకటేశ్వర్లు (ప్రమాద రహిత సర్వీస్ 27 సంవత్సరాల ఐదు నెలలు) వీరిని సన్మానించారు. అదేవిధంగా ప్రతి డిపో నుంచి ముగ్గురు చొప్పున 21 మంది ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించారు. ఈసందర్భంగా డిటివో మాట్లాడుతూ ప్రమాదాల్లో అతి తక్కువ శాతం ఆర్టిసిలో మాత్రమే ఉన్నాయన్నారు. ఏ సీజన్‌లోనైనా కష్టపడి డ్రైవర్లు బస్సులు నడుపుతున్నారని తెలిపారు. ఏసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ బస్సులు నడిపేటప్పుడు చాలా ఏకాగ్రతగా నడపాలని సూచించారు. సురక్షి ప్రయాణ సౌకర్యాన్ని ప్రయాణికులకు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జివిఎన్ పవిత్ర, డిపో మేనేజర్లు, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, ఆర్టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు కార్యాలయాలు..

# ఉద్యమ కేంద్రాలు





(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిస్టు కార్యాలయాలు పనిచేస్తుంటాయని ఎన్నికలప్పుడు మాత్రమే పనిచేసే కార్యాలయాలకు, నిరంతరం ప్రజల కోసం పనిచేసే కార్యాలయాలకు మధ్య తేడాను గమనించాలన్నారు. దేశంలో అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని అవకాశవాద రాజకీయాలతో ప్రజాస్వామ్యంలో పెనుప్రమాదం చోటు చేసుకుంటుందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఊసరవెల్లుల్లా పార్టీలు మారుతున్నారని ఇటువంటి వ్యక్తులతో కమ్యూనిస్టు పార్టీకి ఎప్పటికీ నష్టం లేదన్నారు. కమ్యూనిస్టు పార్టీ పక్షాన ప్రజలు సరైన సమయంలో బుద్ది చెబుతారని ఆయన హెచ్చరించారు. దేశంలో ఒక సంక్లిష్ట రాజకీయ పరిస్థితి నెలకొందని ప్రజా సమస్యల పరిష్కారాన్ని, సంక్షేమాన్ని విస్మరించి మత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదలకు సైతం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో వచ్చిన ఒడుదొడుకుల కారణంగా వేలాది కుటుంబాలు కుటుంబ పోషణార్థం పట్టణాలకు వలస వచ్చాయని, అడ్డా కూలీలుగా చాలా మంది పనిచేస్తున్నారని వీరిని విస్మరించడం తగదన్నారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని పట్టణ పేదలకు వర్తింపజేయాలని అందులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను పట్టణ పేదలకు అందించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి పనులతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ముడిపెట్టడం తగదన్నారు. పేదల పక్షాన సిపిఐ పోరాడుతుందని హేమంతరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఏఐటియుసి అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, వరదా నర్సింహారావు, ముద్రబోయిన అప్పారావు, పార్టీ నాయకులు సిద్ది శ్రీనివాస్, మాలకొండయ్య, ప్రతానపు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తనా నియమావళిను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసిన జిల్లాలోని పలువురు అధికారులతో టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎన్నికల నోటిఫికెషన్ ఫిబ్రవరి 3న జారీ చేస్తారని చెప్పారు. 27వ తేది పోలింగ్ ఉంటుందని, మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలు తెలిసుండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, ప్రజలు సంచరించే ప్రదేశాల్లో కూడా వాటిని ఉంచరాదన్నారు. అదే విధంగా రాజకీయ నాయకుల విగ్రహాలు సైతం కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సమీక్షించారు. నేలకొండపల్లి బౌద్ధస్తూపం, పాలేర లేక్, ఖమ్మం ఖిల్లా, పులిగుండాల ప్రాజెక్టు, వెలుగు మట్ల అర్బన్ పార్కు వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికల గురించి, ఏకో టూరిజంపై సుదీర్ఘంగా చర్చించారు. పర్యాటక ప్రాంతాల వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత స్థితిగతులను వివరిస్తూ జిల్లా అటవీ అధికారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకంగా జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా ఖమ్మంజిల్లాలో ఏకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు వద్ద 40 అడుగుల రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ ఏరియా ఉండాలని, పార్కు లోపల ఎటువంటి ప్లాస్టిక్‌ను అనుమతించకుండా పార్కును ప్లాస్టిక్ ఫ్రీ చేయాలన్నారు. లోపల క్యాంటీన్‌లో కూడా ప్లాస్టిక్ ఉండవద్దని సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్కులో చిన్నపిల్లల ప్లే ఏరియా, బోటింగ్ ఏరియా అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. పార్కు లోపల రోడ్ల నిర్మాణం చేయాలన్నారు. పులిగుండాలలో క్యాంప్ సైట్ క్రియేట్ చేసుకునేవిధంగా పనులు పూర్తి చేసి ఏకో టూరిజం ట్రిప్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు, పులిగుండాల పర్యాటక ప్రాంతాల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని వీటికి వచ్చే మార్గాలను వివరిస్తూ కూడా బోర్డులు ఏర్పాటు చేయాలని, విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఖమ్మంజిల్లా పర్యాటక ప్రాంతాలు , ఏకో టూరిజంకు బ్రాండింగ్ వచ్చేలా నూతన లోగో , ట్యాగ్‌లైన్ తయారు చేయాలన్నారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అటవీ పార్కు , కాటేజీ అభివృద్ధి పనులు ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పాలేరు లేక్ వద్ద పిక్నిక్ స్పాట్ అభివృద్ధి చేయాలని ప్రజలు అధికంగా వచ్చేలా జాతీయ రహదారి వద్ద ప్రచార హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పాలేరు లేక్ వద్ద బోటింగ్, క్యాంటీన్, పిక్నిక్ స్పాట్, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా, బర్డ్ వాచింగ్ సౌకర్యం సిద్ధం చేయాలన్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణ పనులకు ప్రజలతో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. రోప్‌వేకు 500 కిలో మీటర్ల దూరంలో పార్కింగ్ ఏరియాను గుర్తించాలన్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద పురావస్తు శాఖ సమన్వయంతో ముందుగా అవసరమైన మరమ్మతు పనులు చేపట్టి పర్యాటకులను ఆకర్షించాలన్నారు. స్కూల్ విద్యార్థులు, జర్నలిస్టులు, జిల్లా అధికారులతో ఖిల్లాకు హిస్టరీ వాక్ ప్లాన్ చేసుకోవాలని, జాఫర్ బావి వద్ద మార్చి నెలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్‌డివో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, టూరిజం జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి, ఇరిగేషన్, దేవాదాయ, అటవీ, రెవెన్యూ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముని స్ఫూర్తితో ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :**



మహాత్మాగాంధీ ఆశయం, స్ఫూర్తి ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గాందీ వర్థంతి, అమరుల సమస్మారనాన్ని పురస్కరుంచుకని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ త్యాగానికి ప్రతిరూపమైన మహాత్ముని వర్థంతి సందర్భంగా అమరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ స్వతంత్ర సాధనలో మహాత్మాగాంధీ ప్రత్యేక పాత్ర పోషించారని చెప్పారు. వారి స్పూర్తితో అంతా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యుగంధర్‌ను కలిసిన ఏఎంసి నూతన కమిటీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ యువజన నాయకులు తుమ్మల యుగంధర్‌ను ఖమ్మం మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం మర్యాద పూర్వకంగా కలిసింది. గురువారం వీడియోస్ కాలనీలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఏఎంసి ఛైర్మన్‌గా నియమితులైన యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, డైరెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు.

# నీటి వనరుల ఆక్రమణలు గుర్తించండి




**-ఫిబ్రవరి 12లోపు నివేదిక అందించాలి**
**-రిటైనింగ్ వాల్ భూసేకరణపై దృష్టి సారించాలి**
**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నీటి వనరుల ఆక్రమణను గుర్తించి ఫిబ్రవరి 12లోపు నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నీటి వనరుల ఆక్రమణ, భూ సేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రతి 45 మీటర్లకు ఒక విభాగంగా పరిగణించి వాల్ నిర్మించడానికి ఒక బే యూనిట్ అంటారని తెలిపారు. మొత్తం 17 కిలో మీటర్ల స్ట్రేచ్‌లో 345కు పైగా బే యూనిట్లుగా నిర్మించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వీటిలో 8.5 కిలో మీటర్ల వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని మిగిలిన పట్టా భూమి సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ముందు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వాల్ నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు పట్టాదారు వారీగా మ్యాపింగ్ చేసి వివరాలను అందించాలన్నారు. పట్టాదారుతో చర్చలు జరుపుతూ భూ సేకరణ వేగవంతంగా జరిగేలా చూసి 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జూలై వరకు రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని నీటి వనరుల వద్ద ఆక్రమణకు గురైన భూముల వివరాలను రెవెన్యూ మ్యాప్, నీటిపారుదల మ్యాప్, టౌన్ ప్లానింగ్ రికార్డులను పరిశీలించి ఫిబ్రవరి 12 లోపు వివరాలను అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

# నిర్దేశిత సమయంలోగా దరఖాస్తులను పరిష్కరించాలి




**-టి ప్రైడ్ ద్వారా రూ.33.39 లక్షల పెట్టుబడి సబ్సిడీ**
**-అదనపు కలెక్టర్ శ్రీజ**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్, టి ప్రైడ్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో టిజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును అదనపు కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 22 ప్రతిపాదనల్లో 15 ప్రతిపాదనలకు వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులను, తిరస్కరించిన మూడు ప్రతిపాదనలపై అదనపు కలెక్టర్ చర్చించారు. నాలుగు ప్రతిపాదనలను సైతం తక్షణమే పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో టి ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 10 ఎస్సి, ఎస్టి యూనిట్లకు రూ. 33,39,282 పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం టి. సీతారామ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




### అంగన్‌వాడీ కేంద్రాలు మరింత మెరుగ్గా నిర్వహించాలి...

జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ శ్రీజ మహిళ, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పోషణ అభియాన్, ప్రీ స్కూల్ నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అందుతున్న సేవలు, లబ్దిదారుల వివరాలు, అనీమియా నివారణ మొదలగు అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఖమ్మం అర్బన్ రూరల్, తిరుమలాయపాలెం, మధిర, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లి సిడిపివోలు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ పనితీరు ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అంగన్‌వాడీ టీచర్ల హాజరు, పనితీరు, రెగ్యులర్‌గా పర్యవేక్షించాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని ప్రీ స్కూల్‌లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూడాలన్నారు. పోషణ లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ సరఫరా అయ్యేవిధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా మంజూరు చేసిన మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన, మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, సిడిపివోలు, ఏసిడిపివోలు, డిఎంసి, డిహెచ్ఈడబ్ల్యూ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించండి

**-బిఆర్ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వానికి కళ్లు తెరిపించి జ్ఞానోదయం కల్పించాలని బిఆర్ఎస్ నేతలు కోరారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయనందుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో మహాత్మ గాంధీ విగ్రహానికి వినతి పత్రాలు అందించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆదేశాల మేరకు గురువారం ఖమ్మం నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లోని మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులర్పించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, ఏఎంసి మాజీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ లు మాట్లాడుతూ 100 రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 400 రోజులైనా వాటిని అమలు చేయడం లేదన్నారు. గాంధీ అడుగుజాడల్లో స్వరాష్ట్రాన్ని సాధించి వారి ఆశయాల స్ఫూర్తిగా బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణను ప్రగతి పథంలో నడిపించిందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. నేడు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించి హామీలను అమలు చేసే బుద్ధిని ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, ఎస్కె మగ్బూల్, పసుమర్తి రాంమోహన్‌రావు, బుర్రి వెంకట్, కూరాకుల వలరాజు, బొమ్మెర రామ్మూర్తి, బోజడ్ల రాంమోహన్, డోన్‌వాన్ రవి, కొప్పెర నర్సింహారావు, మాటేటి కిరణ్, షకీనా, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పుస్తె, నూతన వస్త్రాలు బహూకరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చిమ్మపుడి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన జిల్లా బిక్షం ఇటీవల మృతిచెందాడు. వారి కుమార్తె నవిత వివాహ సందర్భంగా ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు గుత్తా వెంకటేశ్వరరావు చంద్రమ్మ దంపతులు తమ వంతుగా బంగారు పుస్తె, మెట్టెలు, నూతన వస్త్రాలను వధువు తల్లి నాగమణికి గురువారం అందజేశారు. నూతన వధువును ఆశీర్వదించారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్న గుత్తా వెంకటేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కాళంగి వీరబాబు, పోతురాజు రమేష్, ఎస్‌కె జాని, పోతురాజు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కెఎంసిలో ప్రత్యేక పారిశుధ్య పనులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మాస్ శానిటేషన్‌లో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి రాపర్తి నగర్, కరుణగిరి, మయూరిసెంటర్ బ్రిడ్జిలను గురువారం శుభ్రం చేశారు. ప్రతి డివిజన్ నుంచి ఇద్దరు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి బ్రిడ్జిలపై ఉన్న చెత్తాచెదారాన్ని, మట్టిని తొలగించి శుభ్రం చేశారు.

## గరికపాటి వెంకటరత్నంకు ఘన నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** శ్రీసిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు, వీఏ డెవలపర్స్ అధినేత గరికపాటి ఆంజనేయప్రసాద్ మాతృమూర్తి గరికపాటి వెంకటరత్నం దశదినకర్మను గురువారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మంరూరల్ మండలంలోని శ్రీసిటీలో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగేంధర్, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బాలసాని లక్ష్మి నారాయణ, బండి జగదీష్, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, మామిడి శంకరయ్య, వెన్నం భాస్కర్, కాంగ్రెస్, సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు, రియల్‌వ్యాపారులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాల్టీలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల డిబిఆర్ సర్కిల్‌లో పాలేరునియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను గురువారం దగ్ధం చేశారు. భారతదేశ మాజీ ప్రధాని దివగంత కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాగాంధీ, ప్రజాగాయకుడు గద్దర్‌పై చేసిన వాఖ్యలకు నిరసనగా ప్లకార్డులు పట్టుకొని బిజెపి పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్‌నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీ చారి, కళ్లెం శేషిరెడ్డి, కొొక్కు రాజు, జిల్లా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కస్థాల క్రాంతి, పాలేరునియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిరణ్, ఉపాధ్యక్షులు ఇబ్రాహీం, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షులు కోటి రమణ, ప్రధానకార్యదర్శి వెంకటేష్, బానోత్ హరి, రవీందర్‌సాయి, నవీన్, మహేష్, సాంబ, మనోజ్, మహేష్, మున్న తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ సిద్ధాంతాలను పాటించాలి




**ప్రజాపక్షం/ తల్లాడ :** జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రతిఒక్కరూ పాటించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు కటికి కిరణ్‌కుమార్ సూచించారు. మహాత్మా గాంధీ వర్థంతి సందర్భంగా తల్లాడలోని జెడ్పిఎస్ఎస్ ఉన్నత పాఠశాల నందు గురువారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడి యావత్ భారత జాతికి స్వేచ్ఛ స్వతంత్రాలు అందించిన మహోన్నమైన వ్యక్తి గాంధీ అని అన్నారు. భారతదేశ ప్రజలందరూ గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ దేశాన్ని అభివృద్ధి పరిచే విధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వారాల అజయ్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్.జమాల్, బుజ్జిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ మందా కృష్ణమాదిగను కలిసిన నారపోగు



**ప్రజాపక్షం/ తల్లాడ :** పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగను కాంగ్రెస్ పార్టీ యువనేత, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు నార పోగు వెంకట్ కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించి సత్కరించారు. వేల గొంతులు.. లక్ష డప్పులు బహిరంగ సభకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుకూలంగా ఉందని, వర్గీకరణ కోసం ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రుల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. పద్మశ్రీ అవార్డు రావడంతో ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్నేపల్లి అశోక్ మాదిగ, జిల్లా నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు మాదిగ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిందని బిఆర్ఎస్ లక్ష్మీ దేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం మహాత్మాగాంధి చిత్రపటానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. హామీలను అమలు చేయకుండడా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉర్దూగర్ చైర్మన్ అన్వర్‌పాషా, మాజీ మైనార్టీ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, పొదిలి వెంకటాచలం, శ్రీకాంత్‌నాయక్, మాజీ సర్పంచ్ తాడూరి రజాక్, మెరుపు రమేష్, గోనె సురేష్, మహబూబ్‌పాషా, ఎర్రబడి శ్రీను, రసూల్, కోటా రాంబాబు, కాంపెల్లి వెంకన్న, పూర్ణచారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని వైరా మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర సూచించారు. గురువారం మండల కేంద్రం సర్దార్ జమలాపురం కేశవరావు కాలేజిలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు ప్రతిఒక్కరూ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని తెలిపారు. తప్పనిసరిగా వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపే వారు సీటు బెల్టు వాడాలని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా కాలేజి విద్యార్థులు ప్రయాణం చేసేటప్పుడు వాహనాలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. ఈకార్యక్రమంలో సరస్వతీ డిగ్రీ కాలేజ్ యాజమాన్యం నాగిరెడ్డి రమేష్, మిరియాల శ్యాంప్రసాద్, నాగేశ్వరరావు, మీనవోలు శ్రీ భాస్కర్ పాఠశాల డైరెక్టర్ బి.సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ చల్లా కోటయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో మంచిగా చదువుకుని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిశ్రీ, సంస్థ డైరెక్టర్ నాళ్ళ భానుచందర్, రేమిడిచర్ల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిసిరోడ్ల నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు

**- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**
**- చోద్యం చూస్తున్న అధికారులు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలంలోని చిన్న వెంకటగిరిలోపంచాయతీపరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసిరోడ్ల నాణ్యతపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన ప్రమాణాలు పాటించుకుండా నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. అధికారులు పట్టింపు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. దీంతో ప్రారంభానికి ముందే అస్తవ్యస్తంగా, దెబ్బతినేలా ఉన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.కోటి విలువైన 12 రోడ్లు మంజూరయ్యాయి. వీటిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.చిన్నవెంకటగిరిలో 2, పెద్ద వెంకటగిరిలో 2, ఎస్‌సీ,బీసీ కాలనీలో 3, ఇందిరమ్మకాలనీ 1,2లో 5రోడ్లను నూతనంగా నిర్మాణం చేశారు. కాగా వీటిని నిబంధనల ప్రకారం కాకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో నిర్మించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇవ్వడంతో పాటు రోడ్డు మన్నికకు సరిపడా నీటి క్యూరింగ్ చేయకపోవడం శోచనీయం. రోడ్లు ఏర్పాటు తర్వాత ఇరువైపుల మట్టిని పోయాల్సి ఉన్నప్పటికీ అలాగే వదిలేసి చేతులుదులుపుకున్నాడు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో తనను ఎవరు అడిగేది అని ఎత్తు,పల్లాలుగా నిర్మాణం చేశాడు. దీంతో రెండు వాహనాలు వస్తే పక్కకు జరిగినప్పుడు స్కిడ్ డై ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాకుండా వర్షకాలంలో నీరు రోడ్లపై నిలిచి ఇండ్లలో నుంచి ప్రజలు రోడ్లపై నడవలేని పరిస్థితులు సైతం ఎదురయ్యేలా కనిపిస్తుంది. ఇప్పటికైన అధికారులు సిసిరోడ్ల ఏర్పాటులో జరిగిన తప్పిదాలను పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం జయంతిని జరిపి గాంధీ చిత్రపటానికి పూలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో గాంధీ జయంతి, అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేతృత్వంలో మౌనం పాటించారు. భద్రాచలం పట్టణంలో మార్కెట్ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు పూల మాలలు వేసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మానె రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ఏడాది దాటుతున్నప్పటికీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఆ దిశగా ముందుకు కదిలేలా చేయాలని మహాత్మున్ని కోరారు. రైతు, యూత్, మహిళా, విద్యార్థి డిక్లరేషన్ పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ అగ్రనేతలు తిరిగి లేనిపోని మాయమాటలు చెప్పి అధికారం చేజిక్కించుకున్న తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా టిఎన్‌జిఓస్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేశారు. మండల కన్వీనర్, కో కన్వీనర్ ఆకోజ్ సునీల్ కుమార్, రేపాక పూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోలా రాజు, ప్రేమ్‌కుమార్, ఏడుకొండలు, నర్సింహులు, రామకృష్ణ, శివ, యువరాజ్, శ్రీరాములు, లక్ష్మీ ప్రియాంక, సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి ప్రధాన కార్యాలయం నందు అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిఎం పర్సనల్ వెల్ఫేర్ ఆర్‌సి కే.శ్రీనివాస రావు, జిఎంపర్సనల్ ఐఆర్ పిఎం కవితా నాయుడు, జిఎంఫైనాన్స్ ఎం.సుబ్బా రావు హాజరయ్యారు. ఈ సంధర్భముగా వారు మాట్లాడుతూ, భారత హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మన సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ఆదేశాల తో సింగరేణి వ్యాప్తముగా అన్నీ ఏరియాలలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకలను నిర్వహించుతున్నాం. ప్రతి ఏడాది జనవరి 30 వ తారీఖున మన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సంధర్భముగా ఈ రోజున భారతదేశ స్వాతంత్ర పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన వారి సంస్మరణార్థం ఈ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నాం అన్నారు. అలాగే మనం ఆ మహనీయుల త్యాగాలను ఎప్పుడు స్మరించుకోవాలని తెలిపారు. అనంతరం భారతదేశ స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించిన వారి జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమం లో జిఎంపర్సనల వెల్ఫేర్ ఆర్‌సి కే.శ్రీనివాస రావు, జిఎం పర్సనల్ ఐఆర్ పిఎం కవితా నాయుడు, జిఎం ఫైనాన్స్ ఎం.సుబ్బా రావు, కార్పోరేట్ లోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

# సీఎంపిఎఫ్ పాస్ బుక్కులను వెంటనే ఇవ్వాలి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ 2024 సంవత్సరం మార్చి వరకు అప్డేట్ అయిన సీఎంపిఎఫ్ పాస్ బుక్కులను తక్షణమే ఇవ్వాలని, కొత్తగా సీఎం పిఎఫ్ నెంబర్ వచ్చిన వారికి పాస్ బుక్కులను ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్‌ఏఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ లోని సివిల్ డిపార్ట్మెంట్, నర్స్ క్వార్ట్స్ కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు సీఎం పిఎఫ్ లో జమైన అయిన డబ్బులను అప్డేట్ చేసి కాంట్రాక్ట్ కార్మికులకు తెలియజేయవలసి ఉన్నదని తెలిపారు. కొంతమంది కాంట్రాక్టర్లు మారిపోయినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికుల ఖాతాలలో ఎంత డబ్బులు ఉన్నాయో తెలియక కాంట్రాక్ట్ కార్మికులు గందరగోళపడుతున్నారని తెలిపారు. తక్షణమే సింగరేణి అకౌంట్స్ అధికారులు,వివిధ విభాగాల హెచ్ఓడి లు చర్యలు తీసుకొని కాంట్రాక్ట్ కార్మికులందరికీ అప్డేట్ అయిన సీఎంపిఎఫ్ పాస్ బుక్కులను తక్షణమే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.చంద్రశేఖర్, నరసింహ రావు, వినోద, అనసూర్య, లక్ష్మి, శంకర్, రమణ, అప్పారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు శాపంగా మారిన ఫ్లెక్సీలు ఏర్పాటు

**-నెలలు తరబడి తీయని ఫ్లెక్సీలు**
**-జీవనోపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా రింగు రోడ్డు వద్ద ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల ఫ్లెక్సీలు చిరు వ్యాపారులకు శాపంగా మారుతున్నాయి. నెలలు తరబడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వాటిని తీయకుండా ఉండటంతో కొంత మంది చిరు వ్యాపారులు వారు బండ్లను కూడా పెట్టుకోలేని పరిస్థితి వైరా రింగు రోడ్డులో ఏర్పడింది. ఫ్లెక్సీలు కట్టుకోవడంలో తప్పులేదు కాని కట్టే ఫ్లెక్సీలు ఎవరికి ఇబ్బంది కలగకుండా ఎలాంటి నష్టం లేకుండా ఫ్లెక్సీలు పైకి కట్టుకుంటే ఇటు చిరు వ్యాపారులు కూడా వారి వ్యాపార సముదాయాన్ని కొనసాగించుకొని జీవనోపాధిని పొందుతారు. కాని అలాకాకుండా గత కొన్ని నెలలు నుండి మున్సిపాలిటీలో పెట్టిన ఫ్లెక్సీలు పెట్టినట్టే ఉంటున్నాయి. ఎవరిని ఏమని అడగలేని పరిస్థితి, చిరు వ్యాపారులు ఎవరికి చెప్పుకోలేక చిందరవందర అవుతున్నారు. రోజువారి డబ్బులు కట్టుకునే చిరు వ్యాపారులు ఎంతోమంది ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు వైరా రింగు రోడ్డు వద్ద ఉన్న ఫ్లెక్సీల ఏర్పాటుపై ప్రత్యేక చొరవ చూపిప్రజలకు ఇబ్బంది కలగకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలి. లేదా ఫ్లెక్సీలు కట్టేటప్పుడు చిరు వ్యాపారులకి, ట్రాఫిక్ నిబంధనలకు ఇబ్బంది కలగకుండా పైకి ఉండేవిధంగా కట్టుకుంటే చిరు వ్యాపారులు కూడా మంచిందని పలువురు సూచిస్తున్నారు.

# 420 హామీలు అమలు చేసే బుద్ధిని ప్రసాదించమని వినతి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు అమలు చేసే బుద్ధిని ప్రసాదించమని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం మాజీ జెడ్‌పిటిసి సున్నం నాగమణి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావులు అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహాత్మునికి ముందుగా శిరస్సు వంచి నివాళులర్పించి, తదుపరి కార్యక్రమాని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏర్పడి ఈ రోజుకి 420 రోజులు పూర్తి అయిందని, ఇచ్చిన 420 హామీల అమలులో మాత్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు కాదు కదా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదన్నారు. కేసీఆర్ 11 సార్లు నాట్లప్పుడు రైతు బంధు వేస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్లపుడే రైతు భరోసా అంటారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం రైతు భరోసా, తులం బంగారం, 4000 పింఛన్, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థినిలకు స్కూటీలు, పూర్తి స్థాయిలో రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో శనగపాటి సీతారాములు, సున్నం బాబురావు, కొంద్రు సుందర్‌రావు, పూరేటి నరసింహారావు, పుష్పాల హనుమంతు, తానం కృష్ణ, వేముల సతీష్, ఊరబెద్ది వెంకన్న, ఎక్స్ సర్పంచులు గడ్డం భవాని, వాడే నాగ రాజు, బైటి రాజేష్, గడ్డం నతానిల్, తమ్మిశెట్టి శ్రీను, పుష్పాల సాయి, పలగాని చెన్నకేశవులు, కుంజా రాంబాబు, పత్తి బిక్షమయ్య, ఐతం రాజు నాగేశ్వరరావు, కొట్టే శేషు, గోల్లమూడి బాలకృష్ణ, తాటి రవి, నున్న నవీన్, పద్దం వెంకటేష్, కొరసా వాసు, కాంపాటి సొందు, గండూరి ప్రమోద్, తాళ్ల శ్రీను, బొర్రా రవి, మీడియం మహేష్, పోడియం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాత జాతి పిత

**ఘనంగా మహాత్మా గాంధీ 77వ వర్ధంతి**



**ప్రజాపక్షం/కరకగూడెం:** యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాత జాతి పిత మహాత్మాగాంధి అని కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కరకగూడెంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ స్మారక కరకగూడెం మేనేజర్ నాగ బండి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతి పిత మహాత్మా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింసా అనే ఆయుధంతో ఆంగ్లేయులను తరిమికొట్టిన సమరయోధుడు, యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రధాత, జాతిపిత మహాత్మా గాంధీ అని, ఆయన చూపిన శాంతియుత మార్గం ద్వారానే ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీజీ అని కొనియాడారు. భారత స్వాతంత్ర్య పోరాటాన్ని, గాంధీజీని విడదీసి చూడలేం, అలాంటి మహాత్ముడి జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత ట్రస్టు ఆధ్వర్యంలో బాలుడికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని ముసలమడుగు గ్రామంలో అనారోగ్యంతో ఉన్న పిల్లి సాయి కృష్ణ అనే బాలుడికి గ్రామానికి చెందిన చేయూత ట్రస్టు ఆర్థిక సహాయం అందించి అండగా నిలబడ్డది. నిరుపేద కుటుంబమైన సాయి కృష్ణ తండ్రి ఆటో నాగరాజు డ్రైవర్, తల్లి నాగ శ్రీ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తరుణంలో ఒక్కసారిగా ఉప్పెనలాగా ఆ కుటుంబంలో ఉన్న బాలుడు సాయి కృష్ణకి గుండె జబ్బు రావడంతో సర్జరీ చేయాలి అందుకు గాను సుమారు 10లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో చేతిలో చిల్లి గవ్వలేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఆరోగ్య శ్రీ నమ్ముకోవడంతో ఆరు లక్షలు ఆరోగ్యశ్రీకి మరో నాలుగు లక్షలు అదనంగా ఖర్చు కావడంతో ప్రతి రూపాయిని బయట వడ్డీకి తెచ్చి కొడుకుని బ్రతికించుకోవాలని తాపత్రంతో ఆ తల్లిదండ్రులు గుండె ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ అనంతరం అప్పుడప్పుడు గుండె పరీక్షలు చేయించడానికి వెళ్లడానికి చిల్లి గవ్వలేక దాతల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ వారికి సమాచారం అందడంతో వెంటనే స్పందించిన ట్రస్ట్ వారు గురువారం ముసలమడుగులోని వారి నివాసాని వెళ్లి సుమారు 5,000రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉండి ఆదుకున్న చేయూత ట్రస్ట్ వారిని కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందిస్తారు. ఈసందర్భంగా చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రస్టు కేవలం విద్య వైద్య అనే రెండు రంగాలను ఎంచుకొని నిరుపేద కుటుంబాలకి ఆర్థిక సాయం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ కే నాగిరెడ్డి, గౌరవ అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, కోశాధికారి పుట్టి రాకేష్, సహాయ కోశాధికారి గాది నర్సిరెడ్డి, సభ్యులు కామిరెడ్డి వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరావు, బెజ్జం వెంకట్రామిరెడ్డి, కామిరెడ్డి వెంకట నాగిరెడ్డి, కైపు చిన్న నాగిరెడ్డి, శనగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## మహాత్మా.. నీ సందేశం జాతికి ఆదేశం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మైలారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగా రాంబాబు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైలారం నందు గురువారం మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పాఠశాల ఆవరణంలో గాంధీ పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. పిల్లలు గాంధీ చేసిన మంచి పనులు గురించి, సత్యం, అహింస అనే ఆయుధలతో స్వాతంత్ర్యం సంగ్రామానికి ముందుకు నడిపిన మహాత్మా అని అనేక ఉద్యమాలు చేసి, ఎన్నో గొప్ప పోరాటాలు చేసి భారతదేశానికి జాతి పీత ఐయ్యడు అని చెప్పారు. అలాగే రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సహా ఉపాధ్యాయులు జి కుమార్ , రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

## 420 హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అడ్డదారిలో అధికారంలోకి రావడం కోసం ప్రజలను మోసం చేసి 420 వాగ్దానాలను ఎన్నికల్లో ఇచ్చి ఇప్పుడు అమలు చేయకపోవడం విచారకరమని బిఆర్ఎస్ మండల నాయకులు విమర్శించారు. గురువారం మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బస్టాండు సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం వినతిని మండల బిఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ హామీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటాలను నిర్మిస్తుందన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించి, ప్రజల ముగింట ముద్దాయిలుగా నిలబెడతామన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దారా వెంకటేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి కొణకండ్ల వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, సీనియర్ నాయకులు భూపతి రమేష్, సూర వెంకటేశ్వరరావు, మేడా మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షులు పసుమర్తి శేషగిరిరావు మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహం నిర్వహించ స్వతంత్ర్యాన్ని తీసుకొచ్చిన ఘనత మహాత్మాగాంధీదే అని, ఆయన అడుగు జాడల్లో పైనిద్దామని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కొదుమూరి జనార్ధన్, సంక కృపాకర్, ధారా బాబు, ఎల్వి రంగారావు, సుగ్గల బాబు, హరి, దారా రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసి అందజేసిన ఎంఎల్‌ఏ రాందాస్



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సైదులుకు ఆరోగ్యరీత్యా పలు సమస్యలతో బాధపడుతుంటే హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్ నందు చికిత్స పొందుతున్నారు. వారికి వైద్య చేయడానికి 2లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. వెంటనే వారి కుటుంబ సభ్యులు ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్‌కలిసి వారి బాధను వివరించారు. వెంటనే స్పందించి వారికి వైద్య ఖర్చులకు 2లక్షల రూపాయలు ఎల్‌వోసిని ఎంఎల్‌ఏ అందించారు. ఎంఎల్ఏకి వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయులకు నగదు రహిత చికిత్స అందించాలి




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఉపాధ్యాయులకు నగదు రహిత చికిత్స అందించాలని టిఎస్ టిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు భూక్య మోహన్ రాథోడ్ డిమాండ్ చేశారు. గురువారం చంద్రుగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వాంకుడోత్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా భూక్య రవి, కోశాధికారిగా భానోత్ బద్రు, గౌరవ అధ్యక్షుడిగా లకావత్ సూర్యం, మహిళా అధ్యక్షులుగా సునీత తదితరులను మండల బాధ్యులుగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి ఎమ్మటే అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగుల తల్లిదండ్రులను పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. సమగ్ర శిక్షణ ఉద్యోగులకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు నాయక్, ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, నరసింహారావు, నరేష్, రంజిత్, వీరభద్రం, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీ వర్ధంతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహాత్మ గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ సిద్దాంతం నేటికి స్ఫూర్తి దాయకమన్నారు. ఆంగ్లేయుల పాలన నుండి భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో గాంధీజీ అగ్రగన్యుడన్నారు. గాంధీజీ దేశం, ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల వీరభద్రం, వడ్డెబోయిన నర్సింహా రావు, రబ్బాని, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, ముజాహిద్



హుస్సేన్, దొడ్డ అశోక్, మద్దినేని రమేష్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ జీవితానికి అంకితమైన వ్యక్తి రామయ్య

**జడ్పీ సీఈవో దీక్షా రైనా**

**ప్రజాపక్షం/చింతకాని :** ఉద్యోగంలో చేరింది మొదలు కుటుంబం కంటే ఉద్యోగ జీవితానికి అంకితమైన వ్యక్తి ఎంపీడవో రామయ్య అని ఖమ్మం జడ్పీ సీఈవో దీక్షా రైనా పేర్కొన్నారు.చింతకాని ఎంపీడీవో రేబల్లి రామయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం చింతకాని రైతువేదిక నందు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ 38 ఏళ్లపాటు పలు హోదాల్లో పనిచేయడం అభినంద నీయ మన్నారు.రామయ్య దంపతులను మండల పరిషత్తు సిబ్బంది , బంధుమిత్రులు, రాజకీయ పార్టీ నాయకులు , పంచాయతీ కార్యద ర్శులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి,



ఎంఈవో వీరపనేని శ్రీనివాసరావు, డాక్టర్ ఆల్తాఫ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు , సీపీఐ మండల సహాయ కార్య దర్శి దూసరి గోపాలరావు, నాయకులు కూరపాటి కిషోర్, మడుపల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# మధిర పట్టణంలో మహాత్మాగాంధీకి ఘన నివాళి

**ప్రజాపక్షం/ మధిర :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మధిర పట్టణంలోని పలు పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాల యాలు, విద్యాసంస్థల్లో గురువారం వర్ధంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ అహింసే ఆయుధంగా భారతదేశానికి స్వతంత్ర్యం తెచ్చిన మహనీయుడు గాంధీజి అని అన్నారు. గాంధీజిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణంలో గాంధీ వర్ధంతి సందర్భంగా అధ్యక్షులు కురు వెళ్ళ వెంకటపురుషోత్తం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాల



యాల్లో, విద్యాసంస్థల్లో గాంధీజి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ మధిర :** గుండెపోటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన గురు వారం మధిర పట్టణంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధిర పట్టణంలోని బంజారా కాలనీలో నివాసముంటున్న పుచ్చకా యల శ్రీను కుమారుడు గోపిరాజు(30) అనే వ్యక్తి మధ్యాహ్న భోజనం చేస్తుండగా ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీను అకాల మృతితో వారి కుటుంబంలో విషాదచా యలు అలుముకున్నాయి. ఈ సంఘట నపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

**ప్రజాపక్షం/పినపాక:** ఉపాధ్యాయులు సమయపా లన పాటించాలని, మధ్యాహ్న భోజన విషయంలో మెనూ పాటించాలని ఎంఈఓ కొమరం నాగయ్య సూచించారు. గురువారం పినపాక మండలంలో వివిధ పాఠశాలలను తనిఖీ చేశారు. మండల పరిధి లోని కొత్తూరు, అడవి రామవరం, రెడ్డిగూడెం, దుగినేపల్లి ప్రాథమిక పాఠశాలలను, భీమవరం,



చెగర్శచల, ముకుందాపురం, భూపతిరావుపేట ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సంద ర్శనలో భాగంగా పాఠశాలలోని పిల్లల వర్క్ షీట్లను తరగతి వారీగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. పాఠశాలలోని పిల్లల సామర్థ్యా లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సీఆర్పీలు దుబ్బ ముకేష్, కొమరం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో బిపి నాయక్

**ప్రజాపక్షం/బోనకల్:** కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి రోహిత్ చౌదరి నాంగలోయి నియోజ కరవర్గంలో పోటీలో భాగంగా గురవారం నిర్వ హించే ప్రచార కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు బిపి నాయక్ ఆయనను కలిసి తన మద్దతును తెలిపారు. రోహిత్ చౌదరి నిబద్ధత గల నేత అని, అత్యధిక ఓట్లు వేసి ఆయ నను గెలిపించుకోవాలని కోరారు. దేశ రాజ ధాని అయిన ఢిల్లీ నేడు యాచించే స్థితిలో ఉందని అన్నారు. ఢిల్లీకి పూర్వవైభవం రావా



లంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. నరేంద్రమోడీ, కేజ్రీవాల్ అబద్దాలు చెప్పడంలో దిట్ట అని ఆరోపించారు. ఢిల్లీలో గాడిలో పెట్టడం, అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ఇది రాహుల్ గాంధీ గ్యారెంటీ అని తెలిపారు. ఢిల్లీ ప్రజల ఆయుష ప్రస్తుతం 12 సంవత్సరాల తగ్గుతుంది. ఢిల్లీ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.

## శ్రీనివాస్‌రెడ్డి ఆశయసాధనలో మేము పయనిస్తాం..

**ప్రజాపక్షం/మణుగూరు:** అశ్వాపురం మండ లం మొండి కుంట గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా నాయకులు కామ్రేడ్ కొల్లు శ్రీనివాస్ రెడ్డి 10 వ వర్ధంతి సందర్భంగా గురువారం సీపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య పాల్గొని, శ్రీని వాస్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వేంకటేశ్వర రావు,



కామ్రేడ్ స్వర్గీయ కొల్లు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు మరియు సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళి

**ప్రజాపక్షం/మణుగూరు:** జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు పిరినకి నవీన్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, మణు గూరు శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థి యువ గర్జన కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు గురువారం మాదిగ విద్యార్థి జేఏసి నాయకులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాద పూర్వ కంగా కలిసి పాయం చేతుల మీదుగా మాదిగ విద్యార్థి యువగర్జన పాంప్లెట్



ఆవిష్కరించారు. అనంతరం జేఏసీ నాయకులకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా జన రల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ, మాదిగ జేఏసీ జిల్లా ప్రచార కార్యదర్శి తోకల శీను, మణు గూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు , కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత అక్షరాభ్యాస మహోత్సవ శుభ ఆహ్వానం

**ప్రజాపక్షం/మణుగూరు:** ఫిబ్రవరి 3వ తేదీ చదువుల తల్లి శ్రీ సరస్వతి దేవి పుట్టినరోజు సందర్భంగా ఆ రోజు ఉదయం గం. 8.30 ని.లకు చిన్నారులకు మణుగూరు సమితి సింగారం ఆర్. టి. సి డిపో ప్రాంగణం లోని శ్రీ శ్రీ కనకదుర్గ ఆలయంలో శ్రాస్రోత్తముగా సనాతన హైంధవ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా అక్షరాభ్యాసం జరిపించనున్నట్లు సనాతన ధర్మ హైంధవ పరిరక్షణ సమితి మరియు హిందూ దేవాలయ పరిరక్షణ సమితి బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డిఎస్పీ రవీందర్ రెడ్డి, తహశీల్దార్ రాఘవ రెడ్డి, డిపో మేనేజర్ శ్యామ్ సుందర్ చేతుల మీదగా జ్యోతి ప్రజ్వలన చేయించి అమ్మవారి పూజ క్రతువు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. ఈ అక్షరాభ్యాసం చేయించుకునే చిన్నారులకు పలక, బలపం, పూజ సామాగ్రి, అమ్మవారి ఫోటో ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. పూజా అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగం, పూర్తి వివరాలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించే పట్టణ పురోహితులు విస్సావజ్జుల శేష గిరి శర్మను సంప్రదించి తమ తమ చిన్నారుల పేర్లను నమోదు చేయించుకోవాలని మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ :9440447450ను సంప్రదించాలని కోరారు. సాంప్రదాయ దుస్తులను ధరించి సకాలంలో చిన్నారులను తీసుకొని ఆలయం వద్దకు రావాలని వారు కోరారు. కావున అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని వారు కోరారు.

## జూలూరుపాడులో గాంధీ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుక లను గురువారం నిర్వహించారు.



ఈ సందర్భంగా అహింసా మార్గం, సత్యాగ్రహ దీక్షల ద్వారా భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని విస్తృత ప్రజా ఆందోళనగా మలచి ప్రపంచానికి సరికొత్త పోరాటరూపాన్ని చూపిన జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వారికి వినమ్ర నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో రామిశెట్టి నాగేశ్వరరావు, వేల్పుల నరసింహారావు, కొలిపాక వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మోదుగు రామకృష్ణ, రఘు, అత్తిరాం, పోతురాజు నాగరాజు, రాంజీ, పోతురాజు నరసింహా రావు, మాదుగుల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డిఎం

**ప్రజాపక్షం/భద్రాచలం :** శుక్రవారం ఉ.11 గం. నుండి 12 గం.వరకు డైయిల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నటుల్ భద్రాచలం ఆర్టిసి డిపో మేనేజర్ తిరపతి తెలిపారు. గంటపాటు జరిగే ఈ కార్యక్రమానికి ఆర్‌టిసి సమస్యలపై నేరుగా డిఎంతో ముచ్చటించవచ్చు. ఇందు కోసం 9959225960 నెంబర్‌కు డైయిల్ చేయాలని డిఎం తెలిపారు. ప్రజల నుండి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# 420 రోజులైనా.. 420 హామీలు అమలు కాలే...



**హామీలు అమలు చేయాలని**
**మహాత్మాగాంధీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకుల వినతి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 420 రోజులైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అమలు చేయటం లేదని ఆరోపిస్తూ, గురువారం మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అలివి కాని అసత్య ప్రచారాలతో అడ్డదారిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నేటికి 420 రోజులు గడిచినా హామీల అమలుకు ప్రణాళికలు రచించటంలేదన్నారు. దేశానికి వెన్నుముకైన రైతుకు తెలంగాణలో రేవంత్ సర్కార్ వరుస వెన్నుపోట్లు పొడుస్తుందని, రైతు భరోసా కింద రూ.15000 ఇస్తామని నమ్మబలికి ఏడాది గడిచినా చివరకు రూ.6000 ఇస్తున్నారని, వానాకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టి రైతులను మళ్లీ అప్పులపాలు చేశారని, ఎరువులు, విత్తనాలు కోసం మళ్లీ క్యూ లైన్లు వచ్చాయని, కరెంటు కోతలు, వరికి రూ.500 బోనస్ పేరిట బోగస్ మాటలతో కాంగ్రెస్ రైతుల ఉసురు కొట్టుకుంటుందన్నారు. కపట కాంగ్రెస్ పాలనలో రైతన్నకు 420 రోజులు ఎదురైని చేదు అనుభవాల ఓవైపు, రుణమాఫీ మోసం మరో వైపు, పెట్టుబడి భారం తట్టుకోలేక ఇప్పటికీ 410 మంది పైగా రైతులు మరణాలకు కాంగ్రెస్ సర్కార్ కారణమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్.పి.టి.సి కూసంపూడి రామారావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మాజీ వార్డ్ కౌన్సిలర్లు అద్దంకి అనిల్, చాంద్ పాషా, టిఆర్ఎస్ నాయకులు దొడ్డా శంకర్ రావు, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి పురుషోత్తం, మోదుగు పుల్లారావు, కాల్నేని వెంకటేశ్వరరావు, సూర్య ప్రకాశ్ రెడ్డి, వినుకొండ వెంకటేశ్వరరావు, పర్వతనేని వేణు, మల్లూరి అంకమరాజు, వెదుళ్ళ నాగు, వాటర్ సర్వీసింగ్ బాబు, మిద్దే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్జిట్ క్యాంపుకు 1.5 ఎకరాలు కేటాయింపు

**-ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెంలో ట్రాన్జిట్ క్యాంపు కొరకు 1.5 ఎకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో భూమి కేటాయింపు సంబంధించి ఉత్తర్వుల కాపీని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ కమాండెంట్ నితీష్ ఠాకూర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, సిఆర్పిఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శి మహాత్మాగాంధీ : ఎంఎల్ఏ రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అహింసా మార్గంలో భారత దేశ ప్రజల సంకెళ్ళను తెంచి, స్వతంత్రాన్ని ప్రసాదించిన మార్గదర్శి మహాత్మా గాంధీ అని కొనియాడారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. గురువారం మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, పట్టణంలోని మున్సిపాలిటీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి వేడుకలకు సత్తుపల్లి శాసనసభ్యులు డా.మట్టా రాగమయి ముఖ్య అతిథిగా హాజరై గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్యం ఈరోజు మనం అమలుపరుస్తున్న పంచాయతీరాజ్ వ్యవస్థకు మూలమన్నారు. నేటి యువతకు స్ఫూర్తిదాయకుడు మహాత్మా గాంధీ అని, ఆయన దేశం కోసం తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలు, ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్న కేశవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, పింగళి సామ్యూల్, రవీందర్ రెడ్డి, కమల్ పాషా,పార్థసారథి రెడ్డి, వినుకొండ కృష్ణ, ఆంగోతు రామారావు, సుఖభోగి రాము, జీవన్, కంటే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలను అమలు చేయాలని మహాత్మాగాంధీ చిత్రపటానికి వినతి



**ప్రజాపక్షం/ మధిర :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గాంధీజి విగ్రహానికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి, ఎస్కే ఖాదర్, కొత్తపల్లి నర్సింహారావు, బత్తుల శ్రీనివాసరావు, వేల్పుల శ్రీను, చీదిరాల రాంబాబు, కొండ తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి ఆధ్వర్యంలో సిహెచ్ఓకు సన్మానం



**ప్రజాపక్షం/బోనకల్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్గా విధులు నిర్వర్తించి పదవివిరమణ పొందిన పెద్దినేని శ్రీనివాసరావు దంపతులను ఏఐటీయూసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీ నారాయణ, తోట రామాంజనేయులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2015లో మండలంలో డెంగ్యూ ప్రబలిన సమయంలో శ్రీనివాసరావు చేసిన సేవలు అభినందనీయమన్నారు. 2018లో కేంద్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాయకల్ప అవార్డుల ప్రధమంగా బోనకల్ పిహెచ్సి దక్కడంలో అప్పటి వైద్యాధికారి శ్రీకాంత్తోపాటు, శ్రీనివాసరావు కృషి ఎనలేనిదని అన్నారు. 2020లో వచ్చిన కరోనా మహమ్మారిలో ఎఎన్ఎంలు, వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు, మండల అధికారులను సమన్వయం చేసుకొని పనిచేశారని కొనియాడారు. ప్రజాప్రతినిధులతో, పాత్రికేయులతో సౌమ్యంగా వ్యవహరించి పిహెచ్సి అభివృద్ధిలో కీలక భూమిక పోషించరన్నారు. పదవి విరమణ పదవికే తప్ప, ప్రజలకు చేసే సేవాకార్యక్రమాలకు కాకూడదని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు తమ్మారపు జయమ్మ, నాయకులు బంధం శివరాణి, పొదిళ్ల వాణి, బలబద్రపు వెంకటరమణ, తోటపల్లి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వతంత్ర అమరవీరుల దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారంలో గల 15వ ప్రత్యేక పోలీస్ పటాలము గురువారం ఘనంగా స్వతంత్ర అమర వీరుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాలముఅసిస్టెంట్ కమాండెంట్ ఎస్.డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 30 వ తేది జాతీయ స్థాయిలో గుర్తించబడుతుందని, 1948 జనవరి 30న మహాత్మా గాంధీ నాథూరాం గాడ్సే చేతిలో చనిపోవటంతో ఆ రోజును అమర వీరుల రోజుగా గుర్తిస్తారని వివరించారు. కాబట్టి వీరమరణం పొందిన అమరవీరుల గౌరవార్థం ఈ రోజును అమరవీరుల దినోత్సవంగా జరుపుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఆర్.ఐలు, ఆర్ ఎస్.ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, అధికారులు కానిస్టేబుల్ ఆఫీసర్స్, హోం గార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మనందరి బాధ్యత



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారంలో గల సాయి స్ఫూర్తి డి. ఎ. వి స్కూల్ నందు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవిఐ జె.ఎన్ శ్రీనివాసరావు హాజరైనారు. అనంతరం జరిగిన కార్యక్రమంలోఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత కార్యక్రమాల్లో భాగంగా రహదారి భద్రత ప్రాధాన్యతను తెలియజేస్తూ జనవరి 1నుంచి 31 వరకు తమ పరిధిలోని ప్రతి పాఠశాలకు వెళ్లి రోడ్డు భద్రత యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తున్నామని, విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్ లతో ప్రత్యేకగా మాట్లాడుతూ విద్యార్థులతో ఉన్న బస్సులను మరింత జాగ్రత్తగా నడపాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్రైవర్లు, క్లీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# వంశరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సరోజ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వంశరాజ్ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణానికి చెందిన మాస్టర్ టైలర్ కర్నాటి జానకి రామారావు సతీమణిని తెలంగాణ రాష్ట్ర వంశరాజ్ కుల సంక్షేమ సంఘం మహిళా విభాగ ఉపాధ్యక్షురాలుగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఇరిగిజ్జ మురళీకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందం పాండులు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కర్నాటి సరోజ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లె లక్ష్మి, సత్యం, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కర్నాటి కళ్యాణిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వినుకొండ వెంకటేశ్వర్రావు, రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, యువజన సంఘ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.